సాక్షి
తిరుపతి
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఘనంగా నృత్య దినోత్సవం

తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహించారు. - 8లో



కక్ష సాధింపులను సహించం

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి నేతలు కక్ష సాధింపులకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో



గజ బీభత్సం

పాకాల మండలంబ గానుగపెంట వం చాయతీలో సోమవారం రాత్రి ఏనుగుల గుం పు బీభత్సం సృష్టించింది. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడిగా ఎంపీ మేడా రఘునాథరెడ్డి



మేడా రఘునాథరెడ్డి

తిరుపతి సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజవర్గాలకు ఆ పార్టీ పరిశీలకులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సాఆర్ కడప జిల్లా నందలూరు మండలం, చెన్నయ్యగారిపల్లెకు చెందిన ఆయన పేరొందిన పారిశ్రామిక వేత్తగా, సీనియర్ రాజకీ నాయకులుగా గుర్తింపు పొందారు. 2024లో ఆయన్ని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీగా ఎంపిక చేసింది.

చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా చవ్వా రాజశేఖర్‌రెడ్డి



చవ్వా రాజశేఖర్‌రెడ్డి

తిరుపతి సిటీ: చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా చవ్వా రాజశేఖర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం పట్టణానికి చెందిన ఆయన ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తితో దివంగత నేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచారు. పార్టీకి విధేయుడిగా అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలను గుర్తించి చిత్తూరు పార్లమెంట్ పరిశీలకుడిగా నియమించింది.

ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రాధ

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ రాధను నియమిస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో డాక్టర్ రాధకు పూర్తి బాధ్యతలను అప్పగించారు.



ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం

ఉపాధిలో పచ్చపాతం!

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి టీడీపీ నేతలు తూట్లు పొడుస్తున్నారు. నిరుపేదల కడుపునింపే లక్ష్యానికి గండికొడుతున్నారు. అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా నిధులు స్వాహా చేస్తున్నారు. చివరకు కూలీలు.. రైతులపై పార్టీల ముద్ర వేసి పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఉపాధి సిబ్బందిగా పచ్చమూకను నియమించుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. బినామీ పేర్లతో మస్టర్లు వేయించి ప్రజాధనం కొల్లగొడుతున్నారు. తక్కువ మందితో పనులు చేయించి.. ఎక్కువ మంది వచ్చినట్లు రాసుకుని సొమ్ముచేసుకుంటున్నారు. సామాజికి తనిఖీల్లో తెలుగు తమ్ముళ్ల అవినీతి బట్టబయలైనప్పటికీ ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

- కూలీలు.. రైతులను పార్టీల వారీగా విభజించి పనులు
- ఇష్టారాజ్యంగా బినామీ పేర్లతో మస్టర్లు
- ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి మేట్ల వరకు అందరూ టీడీపీ కార్యకర్తలే
- దొంగ హాజరుతో యథేచ్ఛగా నిధులు స్వాహా
- పాత పనులనే చూపించి దోపిడీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఫీల్డ్ అసిస్టెంట్లు.. మేట్లు.. సీనియర్ మేట్లు.. అందరూ టీడీపీ కార్యకర్తలే. సాంకేతిక సహాయకులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, ఏపీఓలు అధికార పార్టీ అనుకూలురే. దీంతో ఉపాధి హామీ పనుల్లో దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. పచ్చ నేతలు, ఉపాధి సిబ్బంది ఏకమై నిధులను స్వాహా చేసేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు దృష్టి ఉపాధి పథకంపై పడింది. వెంటనే పలు ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నిష్కారణంగా తప్పించి తమ వారిని నియమించుకున్నారు. మొత్తం 1,800 మంది ఫీల్డ్ అసిస్టెంట్లలో దాదాపు 85శాతం మందిని తప్పించినట్లు సమాచారం. మిగిలిన వారు మాట వినకుంటే టీడీపీ నేతలు దాడులకు తెగపడుతుండడం గమనార్హం.

తమ్ముళ్లకే ప్రాధాన్యం

రాజకీయాలకు సంబంధం లేకుండా పేదలందరికీ ఉపాధి పనులు కల్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం తెలుగు తమ్ముళ్లకే పనులు కేటాయిస్తున్నారు. బోగస్ హాజరుతో మస్టర్లను నింపేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారు. టీడీపీ మద్దతుదారులైతే గరిష్టం వేతనం రూ.300 , వైఎస్సార్‌సీపీ వర్గీయులకు అతి తక్కువ వేతనం ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉదాసీనంగా అధికారులు

రాపూరు మండలంలో సైతం ఉపాధి పనుల్లో టీడీపీ నేతలు, సిబ్బంది కుమ్మకై నిధులు దోచుకుంటున్నారు. ఈ మేరకు సోషల్ ఆడిట్, ప్రజావేదికలో కూడా అవినీతి బహిర్గతమైనా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల సైదాపురంలో నిర్వహించిన ప్రజావేదికలో రూ.50లక్షలకు పైగా ఉపాధి నిధులను కాజేసినట్లు తెలిసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



కోటలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారులను ప్రశ్నిస్తున్న కూలీలు (ఫైల్)

ప్రభుత్వ సొమ్ము పక్కదారి!

ఇటీవల కోట పంచాయతీలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. అందులో దాదాపు రూ.కోటికి పైగా ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టినట్లు వెల్లడైంది. అయితే పీడీ శ్రీనివాసప్రసాద్ నేతృత్వంలో చేపట్టిన ప్రజావేదికలో మాత్రం కేవలం రూ.4లక్షలే అవినీతి జరిగినట్లు అధికారులు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. ఓ మండలస్థాయి అధికారి ఆధ్వర్యంలోనే ఉపాధి నిధులు బొక్కేసారంటూ పలువురు నేరుగా పీడీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.



దాచూరులో పనులు చేస్తున్న దృశ్యం

ముడుపులు ఇస్తేనే జాబ్ కార్డులు

అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి పనులు కల్పించాలి. ఎలాంటి రుసుం లేకుండా జాబ్‌కార్డులు జారీ చేయాలి. అయితే ఒక్కో జాబ్‌కార్డుకు రూ.1500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు.

యంత్రాలతోనే..

జిల్లాల్లో సుమారు 10వేలకు పైగానే ఫామ్‌పాండ్స్ నిర్మించాలనేది లక్ష్యం. ఇప్పటికే వీటికి సంబంధించి పనులు సాగుతున్నాయి. వాటిని కూలీలతో చేయించకుండా యంత్రాలతో కానిచ్చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జేసీబీతో అంతా పూర్తి చేసిన తర్వాత ఒకటి, రెండు రోజులు కూలీలతో తూతూమంత్రంగా పనులు చేయించి బిల్లులు కొల్లగొడుతున్నారు. ఒక్కో ఫామ్‌ఫాండ్‌కు సైజ్‌ను బట్టి రూ. 50వేలు నుంచి రూ.లక్ష వరకు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వెంటనే వారిపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి పనులకు రానివ్వకుండా తరిమేస్తున్నట్లు తెలిసింది.

చేసిందే చేస్తూ..!

వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలం కుల్లూరు పంచాయితీలో పంట కాలువ పూడిక తీతకు సంబంధించి వర్క్ ఐడీ : 19185010215075 కింద ఏడుగురు మాత్రమే పనులు చేశారు. వీరికి మస్టర్ నంబర్ 543 నమోదు చేశారు. అయితే ఇదే ఫోటో పెట్టి 20 మంది పనులు చేసినట్లు 544, 545 నంబర్లతో మస్టర్లు నమోదు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా కష్టపడి పనిచేసే కూలీలకు అంతంత మాత్రంగా కూలి డబ్బులు వస్తుంటే, బినామీ కూలీలకు మాత్రం అధిక మొత్తంలో నగదు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దాచూరు గ్రామంలో ట్యాంకు నిర్మాణానికి రెండు వర్క్ ఐడీలు : 9999005189091, 9999005189093 కింద పనులు చేశారు. 10 మస్టర్‌లకు గానూ 37 మంది పనికి వచ్చినట్లు బినామీ మస్టర్లు వేశారు. నిజానికి అక్కడ పనికి వచ్చింది 12 మంది మాత్రమే అని పలువురు కూలీలు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలోనే మరో ఐడీ నంబర్ 1710385 సృష్టించి ఫీడర్ కాలువ పని చేసినట్టు పాత ఫొటోలు అప్‌లోడ్ చేసి నగదు స్వాహా చేసేశారని వివరిస్తున్నారు. మేట్‌లుగా అవతారం ఎత్తిన తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా అందిన కాడికి దోచుకుంటున్నారని మండిపడుతున్నారు.



కుల్లూరులో పనులు చేస్తున్న కూలీలు

కొలతల మేరకే కూలి

“ ఉపాధి పనుల్లో కొలతల ప్రకారం చేస్తేనే కూలి చెల్లిస్తాం. బినామీ పేర్లతో మస్టర్ వేసుంటే చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో మస్టర్ వెరిఫికేషన్ చేపడతాం. అవకతవకలుంటే ఎంపీడీఓ దృష్టికి తీసుకెళతాం. అవినీతిని సహించే ప్రసక్తే లేదు.

– సునీల్, ఏపీఓ, కలువాయి

పత్రికా స్వేచ్ఛను హరించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. మీడియాపై యథేచ్ఛగా పచ్చమూకను ఉసిగొల్పుతోంది. ప్రధానంగా సాక్షి విలేకరులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతోంది. సర్కారు వైఫల్యాలను ఎండగడుతుండడంతో తట్టుకోలేక దౌర్జన్యాలకు సైతం తెగబడుతోంది. ఈ క్రమంలో కూటమి నేతల వైఖరిపై జర్నలిస్టులు మండిపడుతున్నారు. పాత్రికేయులపై భౌతిక దాడులకు పాల్పడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోర్త్ ఎస్టేట్‌పై జులుం ప్రదర్శించడాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.

- జర్నలిస్టులపై కూటమి నేతల దాడులు
- సాక్షి విలేకరులే టార్గెట్‌గా కుట్రలు
- ఖండించిన తిరుపతి పాత్రికేయులు
- అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు



ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తిరుపతి జర్నలిస్టులు

చికిత్స పొందుతున్న సాక్షి విలేకరి శ్రీనివాసులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



కలంపై జులుం!

తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ మీడియాను అణగదొక్కేందుకు యత్నిస్తోందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్రిక కార్యాలయాలు, జర్నలిస్టులపై భౌతిక దాడులు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. శ్రీకాళహస్తి అర్బన్ సాక్షి రిపోర్టర్ ఎస్.శ్రీనివాసులుపై సోమవారం రాత్రి జరిగిన దాడికి నిరసనగా తిరుపతి జర్నలిస్టులు నిరసన తెలిపారు. మంగళవారం తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని అడిషనల్ ఎస్పీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారికి ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నేతల మధ్య పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటు సందర్భంగా వివాదం ఏర్పడిందని, ఆ గొడవను సాక్షి రిపోర్టర్ శ్రీనివాసులు ఫొటో తీస్తుండగా దాడి చేశారని వివరించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళుతుంటే మరోసారి దాడులు చేశారన్నారు. నిందితులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అరాచక రాజకీయం

రేణిగుంట: శ్రీకాళహస్తిలో ఇలాంటి అరాచక రాజకీయాలను ఎప్పుడూ చూడలేదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాక్షి విలేకరి నెల్లూరు శ్రీనివాసులును ఆయన మంగళవారం పరామర్శించారు. శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాక్షి విలేకర్లపై పచ్చమూక అమానుషంగా ప్రవర్తించిందని మండిపడ్డారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని, చివరకు పోలీస్‌స్టేషన్ ఎదుటే మరో మారు టీడీపీ నేతలు దాడి చేశారని విమర్శించారు. నెల్లూరు శ్రీనివాసులను హతమార్చేందుకే మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధితులపైనే పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుందని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యే ఉన్నప్పుడు ఎల్లోమీడియాలో తనపై అనేక అసత్య ఆరోపణలతో కట్టు కథలు ప్రచురించినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీ స్పందించి శ్రీకాళహస్తిలో శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. ముక్కంటి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, యువత అధ్యక్షుడు శ్రీవారి సురేష్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, నేతలు ఉత్తరాజి శరవణ కుమార్, కంఠా ఉదయ్ కుమార్, మున్నా రాయల్, శివ కుమార్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు



“ కూటమి నేతలు పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే మీడియాపై దాడులు చేయడం హేయం. కూటమి అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న సాక్షి విలేకరులపై భౌతిక దాడులకు దిగడం దారుణం. శ్రీకాళహస్తికి చెందిన సాక్షి విలేకరి శ్రీనివాసులును చంపేందుకు యత్నించడం దుర్మార్గం. పత్రికా కార్యాలయాలపై, సాక్షి విలేకరులపై కూటమి నాయకులు దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తుండడం బాధాకరం. – భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు

ప్రశ్నించే గొంతుకను నొక్కేందుకే..



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించే మీడియా గొంతుకను నొక్కేందుకే కూటమి నేతలు విలేకరులపై దాడులకు తెగబడుతున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులను ప్రోత్సహిస్తుండడం అన్యాయం. శ్రీకాళహస్తికి చెందిన శ్రీనివాసులపై కూటమి నేతలు దాడులు చేయడం దుర్మార్గం. సాక్షి మీడియా, పత్రికలను టార్గెట్ చేయడం ప్రభుత్వ కుట్రలో భాగమే. కక్ష సాధింపులకు పాల్పడడం కూటమి నేతలకు పరిపాటిగా మారింది. – గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

కక్ష సాధింపుతోనే దాడులు



కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపే సాక్షి విలేకరులపై దాడులకు తెగబడడం హేయమైన చర్య. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సాక్షి విలేకరులపై దాడులు జరుగుతున్నాయి. కక్ష సాధింపుతోనే దాడులకు పాల్పడుతున్నారు. – అభినయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త

దాడులు హేయం

కూటమి ప్రభుత్వం పాత్రికేయులపై దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం హేయం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు తావులేదు. కలంపై దాడిని దారుణంగా భావిస్తున్నాం. వాస్తవాలను ప్రచురిస్తే కేసులు నమోదు చేయడం సరికాదు. ఇలాంటి అంశాలను సమాజం హర్షించదు. ప్రజలను చైతన్య వంతులను చేసే జర్నలిస్టులపై భౌతికదాడులు చేయడం, కేసులు నమోదు చేయడం భావ్యం కాదు.

– కల్లుపల్లి సురేంద్రరెడ్డి, మీడియా ఫెడరేషన్ నేత

కచ్చితంగా కుట్రే

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సాక్షిని టార్గెట్ చేస్తోంది. ఇటీవల సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేశారు. వారం రోజుల క్రితం ఏలూరులో సాక్షి కార్యాలయంపై టీడీపీ ఎమ్మెల్యే దాడి చేశారు. తాజాగా శ్రీకాళహస్తిలో సాక్షి రిపోర్టర్ శ్రీనివాసులును దారుణంగా కొట్టారు. ఇది కచ్చితంగా కుట్రే.

– పి.బాలచంద్ర, తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి

‘ఉపాధి’లో అవినీతిపై విచారణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

సైదాపురం : ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ, ఇష్టారాజ్యంగా జాబ్‌కార్డులు అందించి నిధులు కాజేస్తున్నారంటూ సైదాపురం మండలం రాగనరామాపురం సర్పంచ్ ఉషా నరసమ్మ ఆరోపించారు. ఒక్కో ఇంట్లో మూడు, నాలుగు జాబ్‌కార్డులు ఉన్నాయని, పనులకు రానివారి పేర్ల మీద మస్టర్ రాసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారి డి.విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాగనరామాపురంలో విచారణ చేపట్టారు. ఉపాధిలో భారీగా అక్రమాలు బహిర్గతమైనట్లు తెలిసింది. దీనిపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏపీఓ సురేంద్ర, కార్యదర్శి మాధవీలత పాల్గొన్నారు.

రేపటి నుంచి పీజీ కళాశాలలకు సెలవులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీ పీజీ కళాశాలలకు గురువారం నుంచి జూన్ 15వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటిస్తూ మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 16వ తేదీన కళాశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

5 నుంచి ఉద్యమ కార్యాచరణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి : విద్యారంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న గందరగోళ పరిస్థితులకు నిరసనగా మే 5వ తేదీ నుంచి ఉద్యమ కార్యాచరణ అమలు చేయనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మురళీకృష్ణ, బి.బాలసుబ్రమణ్యం స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ సర్కారు విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతోందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను నెలకొల్పితే, కూటమి సర్కారు తొమ్మిది రకాల బడులను ఏర్పాటు చేసేందుక యత్నిస్తోందని వెల్లడించారు. . ఒక్కో పాఠశాలకు ఒక్కొక్క రకం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8. తరగతులు ఉన్న చోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించాలని సూచించారు. ప్రతి తరగతికి ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపీఎస్ అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. పెండింగ్ డీఏలను తక్షణం ప్రకటించాలన్నారు. తమ పూర్తిస్థాయి డిమాండ్లను పరిష్కరించకుంటే 5న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 9న జిల్లా కేంద్రంలో ధర్నాలు. 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించారు . సమావేశంలో ఏపీటీఎఫ్ నేతలు వెంకటాద్రి, గోపాల్, సురేష్ బాబు చంద్రశేఖర్, హరి గజేంద్ర, దిలీప్ పాల్గొన్నారు.

యుగ్మ సదస్సులో ఎన్‌ఎస్‌యూ బృందం

తిరుపతి సిటీ: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, వద్వాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా జరుగుతున్న యుగ్మ జాతీయ సదస్సులో తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ అధికారుల బృందం పాల్గొంది. విశ్వవిద్యాలయాలలో వినూత్న కార్యక్రమాల నిర్వహణ, నూతన పరిశోధనలను ప్రోత్సహించడం.. ఇత్యాది అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్న సదస్సులో వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ పాల్గొన్నారు.



సదస్సులో వీసీ, ఎన్‌ఎస్‌యూ అధ్యాపకులు

నేడే పాలిసెట్

- జిల్లాలోని 3ప్రాంతాల్లో 15పరీక్ష కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాలి సెట్ -2025 నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. తిరుపతిలో 8, గూడూరులో 5, సత్యవేడులో 2, మొత్తం 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం బల్లలు, లైట్లు, ఫ్యాన్లు, మంచి నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ క్రమంలో మంగళవారం పాలిసెట్ కో-ఆర్డినేటర్ జి.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ పాలి సెట్‌ను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో 3,771మంది, గూడూరులో 1,217మంది, సత్యవేడులో300 మంది, మొత్తం 5,288 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 9.30 గంటలకల్లా విద్యార్థులు చేరుకోవాలని, 10గంటల నుంచే లోపలకి అనుమతిస్తామని చెప్పారు. 11 గంటలకు ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి పంపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలాగే సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్లు, స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని కోరారు పరీక్షకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఒరిజినల్ హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ఏదైనా ఫొటో కలిగిన గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్పనర్‌ను తెచ్చుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గజ బీభత్సం


విరిగిపోయిన కొబ్బరి చెట్టు

పాకాల : మండలంలోని గానుగపెంట పంచాయతీలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. సోమవారం రాత్రి చినపాపయ్యగారిపల్లెలోని పి.శివయ్య అనే రైతుకు చెందిన 3 ఎకరాల మామిడి, చెరుకు తోట, కొబ్బరి చెట్లతో పాటు పొలం చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. అలాగే సోమశేఖర్ అనే రైతుకు చెందిన 2 ఎకరాల వరి పైరు, గురుదేవ్, పట్నం చెంగయ్య, పట్నం రామయ్య, టి.మునెమ్మ పొలాలోని వరి పంటను నాశనం చేశాయి. రైతు మోహన్‌కు చెందిన కొబ్బరి చెట్లు, మంజులమ్మ పొలంలోని మామిడి, టెంకాయ చెట్లను విరిచేశాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు మంగళవారం గ్రామానికి వెళ్లి దెబ్బతిన్న తోటలు, పంటలను పరిశీలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఏర్పేడు(రేణిగుంట):రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గంలో, ఏర్పేడు మండలం బాలకృష్ణాపురం వద్ద మంగళవారం సుమారు 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ రవి, శ్రీకాళహస్తి రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహా న్ని ఎవరైనా గుర్తిస్తే, ఫోన్ నంబర్ 94412451 89కు తెలియజేయాలని శ్రీకాళహస్తి రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు యాదవ్ కోరారు.

విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : పద్మావతి కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థిని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కుప్పంలోని చిన్న బంగారు నత్తం గ్రామానికి చెందిన జగదీష్, మల్లార్ మతి కుమార్తె ఆరాధన (21) తిరుపతి పద్మావతి కళాశాలలో చదువుతుంది. తిరుపతిలోని వెస్ట్ చర్చి వద్ద ఓ హాస్టల్ లో ఉంటూ కాలేజీకి వెళ్లేది. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఈ క్రమంలో హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

గంగమ్మ ఆలయానికి విరాళం


ఆలయ ఈఓకు నగదు అందిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన బుర్ర కౌసల్య మంగళవారం రూ.1,00,101 విరాళం అందజేశారు. ఆలయ ఈఓ ఏ.జయకుమార్‌కు నగదు అందించారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.



సచివాలయాలకు గడ్డుకాలమేనా

ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్థానికంగా అందించేందుకు గత ప్రభుత్వం గ్రామ సచివాలయాలను తీసుకువచ్చింది. రెండు వేల జనాభాకు ఒకటి చొప్పున ఏర్పాటుచేసింది. తద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. వాటి సంఖ్యను కుదించాలని నిర్ణయించింది. రైతులకు స్థానికంగా సేవలిస్తున్న ఆర్బీకేలను సైతం కుదించాలని చూస్తోంది. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. మళ్లీ మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు.

- సచివాలయాల కుదింపుకు శ్రీకారం
- క్షేత్రస్థాయిలో దూరంకానున్న సేవలు
- 691 సచివాలయాలను 349కి కుదింపుకు ప్రతిపాదనలు
- ఉత్తర్వులు అందిన వెంటనే అమలు సన్నాహాలు
- 200లకు పైగా సేవలు అందిస్తున్న సచివాలయాలు
- గత ప్రభుత్వం చేసిన మేలును చెరిపేస్తున్న కూటమి సర్కార్
- సచివాలయ రూపు రేఖల మార్పుకు కుట్రలు
- ఆర్బీకేలదీ అదే పరిస్థితి

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో 691 సచివాలయాలు ఉన్నాయి. ఈ క్రమంలో క్లస్టర్ల పేరుతో రెండు నుంచి మూడు సచివాలయాలను ఒక్కటిగా మార్పు చేసి 349కి కుదించనుంది. తద్వారా నాలుగు నుంచి ఐదు గ్రామాలకు చెందిన వారికి ఒక్కచోట సేవలు అందించనుంది. అలాగే పట్టణ, నగర ప్రాంతాల్లోను నాలుగు వార్డులకు చెందిన సచివాలయాలను ఒక్కటిగా చేయనుంది. ఆర్బీకేలదీ అదే పరిస్థితి. ఈ క్రమంలోనే పలుచోట్ల నిర్మాణంలో ఉన్న సచివాలయాలను పూర్తి చేయకుండా వదిలేసింది.

సర్వేలో సచివాలయ ఉద్యోగులు

గ్రామ, వార్డు సచివాలయాల్లో 200లకు పైగా సేవలు అందించే ఉద్దేశంతో గత సర్కార్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కూటమి సర్కార్‌లో సచివాలయ వ్యవస్థకు మంగళం పాడాలనే నిర్వీర్యం చేస్తోందని పలువురు మండిపడుతున్నారు. 30 శాతానికి పైగా ఉద్యోగుల ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయలేదు. వలంటీర్లను తొలగించి వారు చేస్తున్న పింఛన్ల పంపిణీ బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. అంతటితో ఆగకుండా 30కి పైగా సర్వేల బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. దీంతో వారు కార్యాలయంలో ఉండకుండా నిత్యం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు.

డివిజన్ల వారీగా సచివాలయాలు

	ప్రస్తుతం గ్రామ, వార్డుల్లో ఉన్నవి	క్లస్టర్లు ఏర్పాటు చేస్తే వచ్చేవి
తిరుపతి	245	124
శ్రీకాళహస్తి	154	81
సూళ్లూరుపేట	137	67
గూడూరు	155	77
మొత్తం	691	349

జిల్లాలో 445 రైతు సేవా కేంద్రాలు

జిల్లాలో 445 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. ఆ తర్వాత వాటిని ప్రాధాన్యతను క్రమేణా తగ్గించే కుట్ర చేస్తున్నారని చర్చజరుగుతోంది. రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువులకు దాణా, పంటల మార్కెటింగ్ తదితర సేవలు అందించేవారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వాటి సేవలకు మంగళం పలికారు.

ప్రభుత్వానికి వివరాలు ఇస్తున్నాం..



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జనాభా ప్రాతిపదికన క్లస్టర్లుగా విభజించి, ఉద్యోగుల వివరాలను సేకరించాం. ప్రభుత్వానికి ఓ నివేదిక అందిస్తాం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముందుకు సాగుతాం. 2500 లోపు జనాభా ఉన్న సచివాలయాలు, 2500లకు పైగా 3500ల లోపు జనాభా, 3500లకు పైగా జనాభా ఉన్న సచివాలయల జాబితాను సిద్ధం చేశాం. – నారాయణరెడ్డి, జిల్లా సచివాలయాల అధికారి

సచివాలయాలు ఎంతో సౌకర్యం



సచివాలయ వ్యవస్థను ఏ ప్రభుత్వం పెట్టినా అందరికీ ఎంతో సౌకర్యంగా ఉంది. ఈ వ్యవస్థను కుదించడం ద్వారా మళ్లీ ఒక గ్రామానికి చెందిన వారు మరో గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇందులో రాజకీయాలు చేయకుండా యథావిధిగా కొనసాగించాలనేది మా అభిప్రాయం. అలా ఉంటేనే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. – వెంకటేష్, చిరు వ్యాపారి

రైతు సేవా కేంద్రాలు చురుగ్గా ఉండాలి



రైతు సేవా కేంద్రాలు చురుగ్గా ఉండాలి, ఎరువులు, పశువులకు దాణా, విత్తనాల తోపాటు రైతులకు సాగు పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం, అలాగే కియోస్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు అండగా ఉండాలి. రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ల కొరత లేకుండా చూడాలి. వాటిని కుదింపు చేస్తే రైతులకు కష్టాలు వస్తాయి. – నరేంద్ర యాదవ్, రైతు

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్:తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామచంద్ర తెలిపారు. నిందితుడిని శెట్టిపల్లె రాజీవ్‌గాంధీకి చెందిన సోమశేఖర్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అడవిలోకి చొరబడిన వ్యక్తి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్

తిరుపతి మంగళం : భాకరాపేట సమీపంలోని అటవీ ప్రాంతంలోకి చొరబడిన వ్యక్తిని మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పిడి లేని గొడ్డలి, బరిసెలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం భాకరాపేట చామల సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. తిరుపతి–పీలేరు రోడ్డు ఉత్తరం వైపున నిషేధిత అటవీ ప్రాంతంలో ముగ్గురు వెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు అడవిలోకి పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకున్నారు. పరారైన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కక్ష సాధింపులను సహించం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోవెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి,సైదాపురం, రాపూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని, అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు కల్యాణి, వహిదా, సుకన్య, ఆటంబాకం శ్రీనివాసులు, ఆరి శంకరయ్య, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండల కన్వీనర్ వెందోటి మధుసూదన్‌రెడ్డి, మన్నారపు రవికుమార్ యాదవ్, చింతల శ్రీనివాసులరెడ్డి, నేతలు పూజారి శ్రీనివాసులు, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తి మృతిపై దర్యాప్తు ముమ్మరం

నాయుడుపేటటౌన్ : ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి(52)ని అదే పార్టీలోని ప్రత్యర్థులే చంపించినట్లు పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు సైతం దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురుమూర్తి బైక్‌ను వాహనం ఢీకొన్న వాహనం ఆయన ప్రత్యర్థులదని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వాహనంలో ఐరన్‌రాడ్‌తో పాటు గ్లౌజులు లభించడంతో ఇది హత్యే అని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీనిపై సీఐ బాబీని వివరణ కోరగా.. గురుమూర్తి కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

మహిళా వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ అవార్డులు ప్రదానం


అవార్డు గ్రహీతలతో వర్సిటీ అధ్యాపకులు, అధికారులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు, ప్రోగ్రాం ఆఫీసర్లకు మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని చేతుల మీదుగా అవార్డులను, పశంసాపత్రాలను అందజేశారు. బెస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు డాక్టర్. యువ, డాక్టర్ పద్మ, బెస్ట్ యూనిట్ అవార్డు డాక్టర్ వజీహభాను, డాక్టర్ కే.రుక్మిణి, బెస్ట్ పీఓ సెకండ్ రన్నరప్‌గా డాక్టర్ హేమావతి, డాక్టర్ భారతి, అప్రిషియేషన్ అవార్డును డాక్టర్ అనిత అందుకున్నారు. అలాగే యూనివర్సిటీ బెస్ట్ వలంటీర్‌గా ఎం.రమ్యకు, 22మంది వలంటీర్లకు అప్రిసియేషన్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్లు టీ.సుధా, విజయలక్ష్మి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగా భవాని, కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ మల్లికార్జున, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఐవీ లలిత కుమారి పాల్గొన్నారు.

ఉద్యోగాల తొలి జాబితా విడుదల

తిరుపతి తుడా: తిరుపతి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, రుయా, ప్రసూతి ఆసుపత్రి, శ్రీ పద్మావతి గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైద్య ఉద్యోగ నియామకాల కోసం గత ఫిబ్రవరిలో చేపట్టిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్ట్ తొలి జాబితాను అధికారులు మంగళవారం ప్రకటించారు. 54 మందితో విడుదలైన జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వైద్య ఉద్యోగ నియామకాల నోడల్ అధికారి డాక్టర్ పార్థసారథి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు తమకు ఎలాంటి సందేహాలున్నా వచ్చే నెల 7వ తేదీలోపు వైద్య కళాశాల నోడల్ అధికారిని రాతపూర్వకంగా సంప్రదించాలని, అలాగే అభ్యంతరాలకు 8074620526 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. మిగిలిన 12 పోస్టులకు సాంకేతిక కారణాల దృష్ట్యా మరో అనుబంధ నోటిఫికేషన్ త్వరలోనే ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ ఉద్యోగాలకోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు http://tirupati.ap.gov.in, http://chittoor.ap.gov.in, www.svmctpt.edu.in వెబ్‌సైట్లను పరిశీలించాలని కోరారు.

ఘనంగా నృత్య దినోత్సవం


కళాకారులు నృత్య ప్రదర్శన

చంద్రగిరి : అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బుధవారం సైతం శ్రీకృష్ణ నటరాజాలయం ఆధ్వర్యంలో నృత్య దినోత్సవ నిర్వహించనున్నారు. సుమారు 10 నృత్య అకాడమీలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

తిరుపతి కల్చరల్: ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో యూనియన్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు 14వేల మంది ఉన్నారని, 12 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. మహిళా కార్మికులకు పని గంటల విధానం అమలు చేయాలని కోరారు. పెన్షన్, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు హెచ్‌ఆర్‌పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా రాధాకృష్ణ, అధ్యక్షులుగా శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయ్యప్ప నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వీరరాఘవయ్య, శంకర్, సుబ్రమణ్యం, వెంకటచలం, శ్రీనివాసులు, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ కార్యదర్శిగా అనంతరావ్, సహాయ కార్యదర్శులుగా సుకుమార్, కళావతి, రవి, లక్ష్మి, వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సుబ్రమణ్యం ఎంపికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.శ్రీధర్,ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం జేసీ శుభం బన్సల్‌తో కలసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో నేషనల్ హైవే పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, టెక్నికల్ మేనేజర్ జయలక్ష్మి, ,రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ రాధాకృష్ణ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

ఎస్వీయూకు భారీగా ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్

తిరుపతి సిటీ : ఎస్వీయూకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారీ స్థాయిలో ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ వచ్చాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలియజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో ఇంత మొత్తం ఆదాయ పన్నుశాఖ నుంచి తిరిగి రావడం ఆనందంగా ఉందన్నారు. వర్సిటీ కామర్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఫల్గుణ కుమార్ తన బృందంతో కలిసి రెండునెలలుగా గణన చేసి ఎలాంటి ఫీజు తీసుకోకుండా డిపాజిట్లపై ఆదాయపన్ను శాఖకు చెల్లించిన రుసుము నుంచి రూ.1,03,84,000లు తిరిగి వచ్చేలా కృషి చేశారని తెలిపారు. గత ఐదేళ్లలో వర్సిటీ చెల్లించిన ఆదాయ పన్ను నుంచి దాదాపు రూ. 8.75 కోట్లు తిరిగి చెల్లింపు చేసేలా ఆడిట్ చేసి ఆదాయపన్ను శాఖకు సమర్పించారని , ఆ రుసుము సైతం విశ్వవిద్యాలయానికి వచ్చే అవకాముందని వెల్లడించారు. ఈ క్రమంలో ఫల్గుణ కుమార్‌కు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మృతదేహాల అప్పగింత


రుయా మార్చురీ వద్ద మృతుల బంధువులు

తిరుపతి తుడా: చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో విజయలక్ష్మి (50), సహన (34) , రజినిగౌడ (37), ఆర్.లేఖన్ గౌడ (11), త్యాగరాజన్ (48) మృతదేహాలకు రుయా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో మతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్రిష్‌విన్(15)కు వైద్యులు స్విమ్స్‌లో చికిత్సలందిస్తున్నారు. క్షతగాత్రులు గీతమ్మ(51) కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు.